సాక్షి
సిద్దిపేట
బుధవారం । 24 । ఏప్రిల్ । 2024

న్యూస్‌రీల్

నేటి నుంచి ప్రాక్టికల్స్

సిద్దిపేట ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బుధవారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట ప్రాంతీయ అభ్యాసకుల సహాయక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సీహెచ్ మధుసూదన్ పేర్కొన్నారు. డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించే ఈ పరీక్షలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు తమ కళాశాల గుర్తింపు కార్డుతో పాటు హాల్‌టికెట్‌ను వెంట తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సహాయక కేంద్రంలో, లేక 73829 29615 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్ష గడువు పొడిగింపు

చిన్నకోడూరు(సిద్దిపేట): పాలిటెక్నిక్ కళాశాలల్లోని ఇంజనీరింగ్ కోర్సుల్లో (పాలిసెట్) ప్రవేశ పరీక్ష దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత తెలిపారు. దరఖాస్తుకు గడువు ఈ నెల 22 వరకు ఉండగా, ప్రభుత్వం ఈ నెల 28 వరకు అవకాశం కల్పించిందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.250, ఇతరులకు రూ. 500 చెల్లించాలన్నారు.

మల్లన్న వార్షిక ఆదాయం రూ. 41.18 కోట్లు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయ వార్షిక (2023–24) ఆదాయం రూ.41.18 కోట్ల మేర వచ్చినట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఏడాది కాలంగా టికెట్లు, వివిధ సేవల ద్వారా రూ. 41,18,30,656 ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. అలాగే ఉత్సవాలు, ప్రసాదాల తయారీ, వేతనాల చెల్లింపులు, వివిధ కార్యక్రమాల నిర్వహణకు రూ. 40,75,57,531 వెచ్చించినట్లు తెలిపారు. ప్రస్తుతం నికర ఆదాయం రూ.18,74,65,477 సమకూరినట్లు వెల్లడించారు.

వేసవి సెలవుల్లో నైపుణ్యం సాధించండి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి




చౌదరిపల్లి స్కూల్‌లో భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): విద్యార్థులు వేసవి సెలవుల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇష్టమైన కళా సాంస్కృతిక రంగాల్లో ప్రావీణ్యం పెంచుకోవాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన వర్గల్ మండలం చౌదరిపల్లి జెడ్పీ ఉన్నతపాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ముగిశాయని, ఇక విద్యార్థులు సెలవులలో పై తరగతుల సంబంధించిన కొత్త విషయాలపై దృష్టి సారించాలన్నారు. బేసిక్స్ నేర్చుకోవాలని, చేతిరాత మెరుగుపరచుకోవాలని సూచించారు. ఇదిలా ఉంటే.. ఉద్యోగ విరమణ పొందుతున్న వర్గల్ మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు, చౌదరిపల్లి హైస్కూల్ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డిని డీఈఓ శాలువాకప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, బుచ్చిరాములు, కృష్ణారెడ్డి, భారతి, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగిరం చేయండి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం దుబ్బాక వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యంపై ఆరా తీశారు. రైతులు ఏ మాత్రం అధైర్యపడొద్దని, ప్రతీ గింజనూ కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించవచ్చని కేంద్రం నిర్వాహకులకు సూచించారు.

27 అడుగుల భారీ విగ్రహం



కుకునూరుపల్లిలో 27 అడుగుల పంచ ముఖ ఆంజనేయ స్వామి విగ్రహం నెలకొల్పారు. ఈ మేరకు మంగళవారం రైల్వే అధికారులు విగ్రహాన్ని ఆవిష్కరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఈ ప్రాంత మంతా మారుమోగింది. విగ్రహ ప్రతిష్ఠోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. - కొండపాక(గజ్వేల్)

గజ్వేల్ పట్టణంలో శోభాయాత్ర



హనుమంతుడి వేషధారణలో భక్తుడు




● జై హనుమాన్

హనుమాన్ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మంగళవారం హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్, హిందూవాహినిల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరాం, జై హనుమాన్ నామస్మరణతో జిల్లా కేంద్రం మారుమోగింది. - ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



సిద్దిపేటలో హనుమాన్ విజయోత్సవ ర్యాలీ

రైతు చుట్టూ రాజకీయం!



“ఏడుపాయల దుర్గమ్మ, మెదక్ చర్చ్ సాక్షిగా చెబుతున్నా.. ఆగస్టు 15లోగా రూ.రెండు లక్షల రైతుల రుణమాఫీ చేసి తీరుతాం.. వచ్చే కొనుగోలు సీజన్ నుంచి వడ్లకు క్వింటాలుకు రూ.ఐదు వందల బోనస్ ఇస్తాం. ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత మాది..

\- మెదక్ రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లో సీఎం, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రకటన”

- రుణమాఫీ, వడ్లకు బోనస్‌లపై మెదక్‌లో రేవంత్ కీలక ప్రకటన
- అన్నదాతల సమస్యలపై ఫోకస్ పెట్టిన బీఆర్‌ఎస్
- డిజిటల్ బోర్డుల ద్వారా హామీల వీడియోల ప్రదర్శన
- ఆసక్తికరంగా లోక్‌సభ ఎన్నికల పోరు





“ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మీరిచ్చిన గ్యారెంటీ హామీలే మీకు భస్మాసురహస్తం అవుతాయి. ఆగస్టు 15 లోపు రూ.39 వేల కోట్ల రైతుల రుణ మాఫీ చేయకపోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తావా.? ఇంకా రైతుబంధు కూడా పూర్తిగా ఇవ్వ లేదు. ధాన్యానికి క్వింటాలుకు రూ.ఐదు వందల బోనస్, ఇతర హామీలను నెరవేర్చనందుకు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి..

\- కొండాపూర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు”

లోక్‌సభ ఎన్నికల్లో రైతుల చుట్టే రాజకీయం తిరుగుతోంది. అన్నదాతల సమస్యలు, సంక్షేమ పథకాలే ఎజెండాగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటలయుద్ధం కొనసాగుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేస్తున్నామని కాంగ్రెస్ చెబుతుండగా, హామీల అమలులో అధికార పార్టీ పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ ఎదురుదాడి చేస్తోంది.

\- సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

అన్నదాతలకు కాంగ్రెస్ హామీలు..

అన్నదాతల సంక్షేమ పథకాలే తమ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ హామీలు ఇస్తుంది. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే కొన్నింటిని అమలు చేశామని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఓటర్లకు వివరించి ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ప్రచార సభలు, ర్యాలీలు, రోడ్‌షోల్లో ఇదే అంశాన్ని ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించడంలో రైతుల పాత్ర కీలకం. ఈ నేపథ్యంలో రెండు పార్టీలు రైతాంగం ఓట్లపై దృష్టి సారించాయి. అన్ని సమావేశాల్లో రైతులకు సంబంధించిన హామీలనే ఎక్కువగా ప్రస్తావిస్తోంది.

రైతాంగ సమస్యలపై బీఆర్‌ఎస్ ఫోకస్

ప్రతిపక్ష బీఆర్‌ఎస్ రైతుల సమస్యలపైనే ఫోకస్ పెట్టింది. అధికార కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తోంది. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేయడంలో విఫలమైన హస్తం పార్టీకి ఈ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కులేదని గులాబీ పార్టీ విమర్శలు గుప్పిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు సంబంధించిన వీడియోలను బీఆర్‌ఎస్ ప్రదర్శిస్తోంది. ప్రతి సమావేశంలోనూ ప్రత్యేకంగా డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేసి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన హామీలకు సంబంధించిన ప్రసంగాలను ఓటర్లకు వివరించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు గులాబీ కార్యకర్తలకు సూచిస్తున్నారు. ఇలా రైతాంగ సమస్యలపై ప్రత్యేకంగా ప్రతిపక్ష, అధికార పార్టీలు దృష్టి సారించడంతో రైతుల చుట్టూ రాజకీయం తిరుగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భిన్నంగా బీజేపీ..

బీజేపీ మాత్రం కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు భిన్నంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోంది. రైతాంగ సమస్యలపై ఫోకస్ పెట్టిన దాఖలాలు కనిపించడం లేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం వంటి అంశాలనే ఆ పార్టీ నేతలు ప్రస్తావిస్తున్నారు.

ఆచరణ అత్యున్నతం కావాలి

- అప్పుడే లక్ష్యం సాధిస్తాం
- సివిల్స్ ర్యాంకర్ బుద్ధి అఖిల్

కొండపాక(గజ్వేల్): ఆచరణ అత్యున్నతంగా ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని సివిల్స్ ర్యాంకర్ బుద్ధి అఖిల్ అన్నారు. కొండపాకలోని హైస్కూల్‌లో నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలన్నారు. ఇందుకు నిరంతర కృషి ముఖ్యమన్నారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులను అవరోధాలుగా కాకుండా అవకాశాలుగా మలుచుకున్నప్పుడే ముందుకు వెళ్తామన్నారు. విద్యార్థి బాల్య దశను కోల్పోకూడదని, బాల్యంలో చేసే పనులన్నీ చేయడం మొదలుపెట్టినప్పటి నుంచే మనలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. కానీ నేటి తరం విద్యార్థులు ఎక్కువ శాతం సెల్‌ఫోన్ల వినియోగిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల అభ్యున్నతి కోరుకుంటుంటారని వారి మార్గదర్శకంలో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుతామన్నారు. క్రమ శిక్షణతో కూడిన విద్య, కంప్యూటర్‌పై అవగాహన, ఇంగ్లిష్ భాష నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. హెచ్‌ఎం విఠల్ నాయక్ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన బుద్ధి అఖిల్ ఐఏఎస్ సాధించడాన్ని ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కొండపాక పేరును దేశ వ్యాప్తం చేసిన బుద్ధి అఖిల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం హెచ్‌ఎం విద్యార్థులకు మూల్యాంకన పుస్తకాలను అందజేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు బుద్ధి అఖిల్‌తో సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పీఆర్‌ఏఈ తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు రఘువర్ధన్‌రెడ్డి, నర్ర భాస్కర్‌రెడ్డి, రామస్వామి, హారతి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, బాలమల్లయ్య, ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సివిల్స్ ర్యాంకర్ బుద్ధి అఖిల్

డీసీసీబీ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరిక

సీఎం సమక్షంలో హస్తం గూటికి..

కొండపాక(గజ్వేల్): డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి (పీఏసీఎస్ కొండపాక చైర్మన్) సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నగరంలోని సీఎం నివాసంలో మంగళవారం సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ఆరెపల్లి మహదేవ్‌గౌడ్, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షురాలు చిట్టి మాధురీరెడ్డి, పలువురు నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.



సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన చిట్టి దేవేందర్‌రెడ్డి తదితరులు

పరిశ్రమలు తెస్తా.. ఉపాధి కల్పిస్తా

బీబీ పాటిల్ ఓ బిజినెస్‌మెన్

- సీఎం సహకారంతో పథకాల అమలు
- అన్నివర్గాలకు మేలు చేస్తా
- ‘సాక్షి’ ఇంటర్వ్యూలో జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ శెట్కార్



నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ కల్పన కర్మాగారాల స్థాపన, వలసల నివారణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఉన్నత విద్యాభివృద్ధి, వైద్యం తదితర రంగాలపై ప్రధాన దృష్టి సారిస్తా. సీఎం రేవంత్ సహకారంతో జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా చూస్తా. బీఆర్‌ఎస్ పాలనలో పదేళ్ల అభివృద్ధి నిలిచిపోవడమే కాకుండా ఎంపీగా బీబీ పాటిల్ కేవలం వ్యాపారాలకే పరిమితమయ్యారు. నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా అని జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ శెట్కార్ తెలిపారు. ఆయన ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

\- నారాయణఖేడ్

ఎంపీగా గెలుపొందితే మీ ప్రణాళిక?

మూడు జాతీయ రహదారులున్న జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తా. వాటిల్లో నిరుద్యోగులు ఉపాధి పొందేలా చూస్తా.

ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శపై మీ స్పందన?

మీరే చూస్తున్నారు. 35కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేశారు.. చేస్తున్నారు. రూ.10లక్షల ఆరోగ్యశ్రీ అందుబాటులోకి వచ్చింది. రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుంది. రూ.2లక్షల రుణమాఫీ ఆగస్టు 15లోపు చేస్తామని రేవంత్ చెబుతున్నారు.

బోధన్–బీదర్ రైల్వేలైన్ పెండింగ్ ఉంది?

బోధన్– బీదర్ రైల్వేలేన్ తాను ఎంపీగా ఉన్న సమయంలో మంజూరు చేయించాను. బోధన్, వర్నీ, బాన్సువాడ, పిట్లం, నారాయణఖేడ్, బీదర్‌కు రైల్వేలేన్ మంజూరు చేసి ఎస్టిమేషన్ చేయించి సర్వే కూడా జరిగింది. పదేళ్ల అధికారంలో ఉన్న ఎంపీ బీబీ పాటిల్ దానిని పూర్తిచేయకుండా విస్మరించారు. ఆయన ప్రజలకు అందుబాటులో ఉండడు. అవకాశవాద రాజకీయాలతో బీజేపీ కండువా వేసుకున్నాడు. ఆయన ఓ బిజినెస్‌మెన్.

బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలు రద్దుచేస్తారని కేసీఆర్ అన్నారు కదా?

రద్దు చేస్తామని ప్రభుత్వం ఎక్కడా ప్రకటన చేయలేదు. బసవేశ్వర, సంగమేశ్వర పథకాలు సింగూరు జలాల ద్వారానే కేటాయించాలి. కేసీఆర్ కాళేశ్వరం నుంచి తెస్తామని చెప్పడంకాదు.. మా సింగూరు నీరు మాకు కేటాయిస్తే చాలు. సింగూరు జలాలు నిజాంసాగర్‌కు కేటాయిస్తూ జిల్లాకు పూర్తిస్థాయిలో దక్కేలా చేస్తా.

ఉన్నత విద్యాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఉన్నత విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తా. ఖేడ్‌కు మోడల్ డిగ్రీ కళాశాల మంజూరు చేయించాను. అందోల్‌కు మంత్రి దామోదర కృషితో జేఎన్‌టీయూ మంజూరు అయింది. జహీరాబాద్‌లో టూరిజం కళాశాల బీఆర్‌ఎస్ హయాంలో మూత వేశారు. తాను తెరిపిస్తా.

వైద్యం, వ్యవసాయ పరంగా..?

ఎంఎస్‌పీ ద్వారా పండించిన పంటకు ధర రావాలి. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్వామినాథన్ రిపోర్టు అమలు చేయబోతున్నాం. రుణమాఫీ చేయబోతున్నాం. చాలా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. మంత్రి దామోదర సహకారంతో పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమిస్తాం.

వెంకట్రామిరెడ్డిని గెలిపించుకుందాం

- కులవృత్తులకు పెద్దపీట వేసింది కేసీఆరే
- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి

గజ్వేల్‌రూరల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కులవృత్తుల సంక్షేమానికి పెద్దపీట వేశారని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, లీగల్‌సెల్ కార్యదర్శి కొట్టాల యాదగిరి ముదిరాజ్ అన్నారు. బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మంగళవారం గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ముదిరాజ్‌లు కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో కొట్టాల యాదగిరి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కేసీఆర్ విశేష కృషి చేశారని కొనియాడారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేశారన్నారు. చెరువుల్లో చేపపిల్లల పెంపకం ద్వారా ఉపాధి కల్పిస్తూ ముదిరాజ్‌లు ఆర్థికాభివృద్ధి సాధించేలా చర్యలు చేపట్టారన్నారు. మాయ మాటలతో ప్రజలను మభ్యపెడుతూ ఓట్లడిగేందుకు వస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చిన బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని, త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.



బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని కలిసిన గజ్వేల్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నేతలు

ఆధ్యాత్మిక చింతన తప్పనిసరి

ఎమ్మెల్యే హరీశ్‌రావు



హరీశ్‌రావును సన్మానించిన ముదిరాజ్‌లు

సిద్దిపేటరూరల్: ప్రతి మనిషికి ఆధ్యాత్మిక చింతన అవసరమని, అప్పుడే ప్రశాంతత ఏర్పడుతుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నారాయణరావుపేట మండల పరిధిలో మంగళవారం జరిగిన పెద్దమ్మ మహోత్సవం, బీరప్ప ఉత్సవాల్లో హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పండుగలను అందరూ ఐకమత్యంతో ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం హరీశ్‌రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హనుమత్ జయంతిలో కొండముచ్చు


హనుమాన్ జయంతి వేడుకల్లో కొండముచ్చు

జహీరాబాద్: హనుమాన్ జయంతి వేడుకల్లో కొండముచ్చు సందడి చేసింది. మంగళవారం పట్టణంలోని దత్తగిరి కాలనీలో గల పంచముఖి హనుమాన్ మందిరంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భక్తులతో పాటు కొండముచ్చు సైతం ఆలయంలోకి వచ్చి పూజా కార్యక్రమాల వద్ద కొద్ది సేపు కూర్చుంది. దీంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. గంట సేపటి వరకు ఆలయ ప్రాంగణంలోనే సంచరించింది.

విద్యుత్ పోల్‌ను ఢీకొని కారు బోల్తా

డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



చిన్నశంకరంపేట(మెదక్): నిద్రమత్తులో కారు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకుపోయి విద్యుత్ పోల్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం రుద్రారం శివారులో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కారులో ఇద్దరు పురోహితులతో సహా డ్రైవర్.. చేగుంట నుంచి చిన్నశంకరంపేట బయలుదేరింది. మార్గమధ్యలో పొలంపల్లి దాటిన తరువాత మలుపు వద్ద కారు అదుపు తప్పి.. రోడ్డు కిందకు దిగి విద్యుత్ పోల్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ మాత్రం స్వల్ప గాయాలయ్యాయి. అందులో ఉన్న పురోహితులు క్షేమంగా బయటపడ్డారు.

బావిలో గుర్తుతెలియని మృతదేహం

హుస్నాబాద్ రూరల్: పాత బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఈ సంఘటన మండలంలోని బంజేరుపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... షణ్ముఖ పారాబాయిలర్ మిల్లు దగ్గర పాత వ్యవసాయ బావి ఉంది. దాని చుట్టూ చెట్లు ఉండటంతో అటువైపు ఎవరూ వెళ్లారు. మంగళవారం ఉదయం మిల్లులోని కూలీలు వేప పుల్లల కోసం బావి వద్దకు వస్తే మృతదేహం కన్పించింది. పోలీసులకు సమాచారమివ్వగా ఇక్కడకు చేరుకుని కూలీల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. నీలి రంగు జీన్స్, వైట్ కలర్ అంగి ధరించి 35 ఏళ్ల వయసు ఉండొచ్చు. కాగా, మృతదేహం కుళ్లిన స్థితికి చేరింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

దొంగకు రిమాండ్

మిరుదొడ్డి(దుబ్బాక): ఓ చోరీ కేసులో దొంగను రిమాండ్‌కు తరలించారు. మంగళవారం మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పర్శరామ్ కథన ప్రకారం.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన భాను ప్రకాష్ వ్యసనాలకు అలవాటు పడి తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. ఇటీవల ఇదే గ్రామానికి చెందిన పద్మ ఇంట్లో చోరీ చేసి బీరువాలో దాచిన రూ. 4 వేల నగదు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా భాను ప్రకాష్ గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారిస్తే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): తల్లీకూతురు అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..... గుమ్మడిదల మండలం నాగిరెడ్డిగూడెంకు చెందిన ఉజ్వల తన కుమార్తె అయిషి సోమవారం పుట్టిల్లు అయిన కామారెడ్డి వెళ్లేందుకు ఉసిరికపల్లి బస్‌స్టాప్ వద్ద తూప్రాన్ వైపు వెళ్లే బస్సు ఎక్కారు. రాత్రి వరకు కామారెడ్డికి చేరకపోవడంతో ఆందోళన చెందిన ఇరు కుటుంబాలు వారు.. తమకు తెలిసిన బంధువులు, పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఉజ్వల భర్త గడ్డం గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

తడిసి మోపెడు



ఈ ఫొటోలో కనిపిస్తుంది.. దుబ్బాకకు చెందిన రైతు కేసుగారి స్వామి రెడ్డి. తనకున్న 10 ఎకరాల్లో ఈ యాసంగిలో వరి సాగు చేశాడు. కోద్దామంటే వారం రోజులుగా కురిసిన వర్షాలకు చేలలో నీరు ఎండిపోకుండా నిలిచిపోయింది. చైన్ హార్వెస్టర్‌తో కోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా 12 ఎకరాలు కోసేందుకు కామన్ హార్వెస్టర్‌తో 14 గంటలు పట్టేది. ఇప్పుడు చైన్ మిషన్‌తో కోస్తే 18 గంటలకు పైగా సమయం తీసుకుంది. వడ్లను రోడ్డుపైకి తెచ్చి ట్రాక్టర్‌లో పోయాల్సి రావడంతో అదనంగా 5 గంటలకు పైగా సమయం పడుతుంది. పైగా కామన్ హార్వెస్టర్‌కు గంటలకు 2 వేలు ధర ఉంటే చైన్ మిషన్‌కు 3 వేలకు పైగా ఉంది. దీంతో అదనంగా 24 వేలు అదనపు భారం పడింది. ఇది ఒక్క స్వామిదే కాదు చాలా మంది రైతులది ఇదే పరిస్థితి. –దుబ్బాక

రైతులకు పెట్టుబడి అదనం

- దెబ్బతీసిన ఇటీవల వర్షాలు
- వరి కోసేందుకు నరక యాతన
- భూమిలో తేమతో దిగబడుతున్న హార్వెస్టర్లు
- చైన్‌మిషన్లతో కోయిస్తే ఎకరానికి రూ. 5 వేలకు పైగా అదనం


వరి కోస్తున్న చైన్‌మిషన్

అసలే భుగర్భ జలాలు అడుగంటాయి. బోర్ల నుంచి నీరు కూడా రాక చాలా పంటలు ఎండిపోయాయి. పంట చేతికి వస్తుందనుకున్న దశలోనే జిల్లాలో వడగండ్ల వర్షం బీభత్సం సృష్టించి తీవ్ర నష్టం చేకూర్చింది. వడ్లు చాలా వరకు రాలిపోవడంతో కనీసం పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి. కాగా, మిగిలిన గింజలను కోద్దామంటే వారం పది రోజులుగా వానలకు పొలం ఆరక దిగబడుతుంది. ఇది కోతకు ఇబ్బందిగా మారింది. దీంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. నాలుగు రోజుల క్రితం వరకు కూడా భారీ వర్షాలు పడటంతో భూములు ఆరకుండా తేమతో ఉన్నాయి. టైర్ హార్వెస్టర్లు దిగబడుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కువ ధర పెట్టి చైన్ మిషన్లతోనే కోతలు కోయించాల్సిన పరిస్థితి. దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లోను వరి కోతలు కోసే రైతులందరిదీ ఇదే పరిస్థితి.

జిల్లాలో 40 శాతం కోత

జిల్లాలో ఈ యాసంగిలో 3.51 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటి వరకు 40 శాతం వరకు అంటే సుమారుగా 1.40 లక్షలకు పైగా ఎకరాల్లో కోతలు కోయడం పూర్తయింది. మిగతా 60 శాతం పూర్తవ్వాల్సి ఉంది.

హార్వెస్టర్‌కు గంటకు రూ.2 వేలు ఉంటే చైన్ మిషన్ గంటకు రూ.3 వేల నుంచి 3,500 వరకు ధర చెల్లించాల్సి వస్తుంది. పొలాలు దిగబడుతుండటంతో వడ్లు పోసేందుకు ట్రాక్టర్లు రాలేని పరిస్థితి. చైన్‌మిషన్‌తో రోడ్డు వరకు వెళ్లి పోసి రావాల్సి వస్తుండటంతో చాలా సమయం పడుతుంది. సామాన్యంగా ఎకరం వరి కోతకు టైర్ హార్వెస్టర్‌తో 1.10 నుంచి 1.20 నిమిషాల సమయం పడుతుంటే చైన్ మిషన్‌తో ఎకరం వరి కోసి వడ్లు బయట పోయాల్సి వస్తుండటంతో 2 గంటలకు పైగా సమయం తీసుకుంటుంది. రైతుకు ఎకరాకు అదనంగా రూ.5 నుంచి 6 వేల వరకు భారం పడుతుంది. అయితే చైన్ మిషన్‌తోనే కోయిస్తుండటంతో డిమాండ్ ఏర్పడి దొరకడం లేదని రైతులు చెబుతున్నారు.

ఎప్పుడు కోస్తనో తెలియడం లేదు

నా 2 ఎకరాల వరి కోతకొచ్చింది. చేనంతా నీరు నిలిచి తేమగా ఉంది. చైన్ మిషన్‌తోనే కోయాల్సిన పరిస్థితి. గంటకు రూ.3,200 అంటున్నారు. ఇప్పటికే చైన్ మిషన్లు దొరకడం లేవు. చాలా మంది రైతుల పొలాలు దిగబడుతుండటంతో చైన్ మిషన్లతోనే కోయించుకుంటున్నారు. నా చేను ఎప్పుడు కోస్తనో ఏమో అర్థం కావడం లేదు.
–పాతూరి పెద్ద లక్ష్మారెడ్డి, రైతు దుబ్బాక

చైన్‌మిషన్‌తో కోయించా

వరుసగా వానలు పడటంతో కోత కొచ్చిన వరి కోసేందుకు చాలా ఇబ్బందులు పడ్డా. వానలతో భూమి ఆరలేదు. పంటను దక్కించుకోవాలనే చైన్ మిషన్‌తో కోయించాను. నేనే కాదు అందరు రైతులు చైన్‌మిషన్‌తోనే కోయించుకుంటున్నారు.
–గన్నె బాల్‌రెడ్డి, రైతు

లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు

- దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధార్థ ప్రకటన
- బ్రోచర్‌ను విడుదల చేసిన మంత్రి దామోదర


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట(అందోల్): కాంగ్రెస్ పార్టీ దళిత డిక్లరేషన్‌ను ప్రకటించినందుకు గాను జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో ఆపార్టీ అభ్యర్థి విజయం కోసం పని చేస్తామని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ ప్రకటించారు. మంగళవారం సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో దీనికి సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ విడుదల చేశారు. కార్యక్రమంలో దళిత వికాస సమితి నియోజకవర్గ కమిటీ ఇన్‌చార్జి గుడ్డి వెంకన్న, ప్రభాకర్, కమిటీ కార్యదర్శి లింగం, కర్రోళ్ల శ్యామ్, సంపత్ చిట్టి, సాయిలు, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

ఎస్‌ఈ మోహన్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన కరెంట్‌ను వినియోగదారులకు అందించేలా విధులు నిర్వహించాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా విద్యుత్ భవన్‌లో కరెంట్ సరఫరాపై ఇంజినీర్లు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో అన్ని కేటగిరీల సర్వీసులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలన్నారు. సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండరాదన్నారు. వేసవి దృష్ట్యా సరఫరాలో కొరత లేకుండా చూడాలని చేయాలన్నారు.

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- కొమురవెల్లి, ఎన్సాన్‌పల్లి, దూళ్మిట్ట మండలాల్లో మద్యం స్వాధీనం
- నిందితులపై కేసు నమోదు

కొమురవెల్లి(సిద్దిపేట): కొండపోచమ్మ ఆలయ పరిసరాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా హోటల్‌లో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులో 6.950 లీటర్ల బీర్లు, విస్కీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా బెల్ట్ షాపులు నడిపినా, బహిరంగ ప్రదేశాలలో పేకాట ఆడినా, పీడీఎస్ రైస్, గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిద్దిపేట అర్బన్: మండలంలోని ఎన్సాన్‌పల్లిలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై మంగళవారం సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు దాడులు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని తత్తరి కనకయ్య ఇంటిలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులో 7.5 లీటర్ల బీర్లు, విస్కీ బాటిళ్లు, అలాగే ఎనగొండ కళావతి ఇంటిలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులో 3.6 లీటర్ల బీర్లు, విస్కీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. బెల్ట్ షాపులను నిర్వహించే వారి సమాచారాన్ని, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి వివరాలను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ 87126-67445, 87126-67446, 87126-67447 నంబర్లలో సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.


కొమురవెల్లి: స్వాధీనం చేసుకున్న బీరు బాటిళ్లు

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల పరిధిలోని బెక్కల్‌లో బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు మద్దూరు ఏఎస్సై విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. బెక్కల్ గ్రామానికి చెందిన బొంగోని రాకేష్ బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు.. అతని ఇంట్లో సోదాలు నిర్వహించారు. దీంతో 9 బీర్లు లభ్యమయ్యాయన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్ట్ షాపు నిర్వహించడం చట్టప్రకారం నేరమన్నారు.

చంపి చెరువులో పడేశారు

- వివాహేతర సంబంధమే ఉపాధ్యాయుడి హత్యకు కారణం
- కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడి భార్య ఉరేసుకొని ఆత్మహత్య


నిందితులను చూపుతున్న సీఐ వెంకటేశ్

చేగుంట(తూప్రాన్): వివాహేతర సంబంధమే ఉపాధ్యాయుడి హత్యకు కారణమని రామాయంపేట సీఐ వెంకటేశ్ వెల్లడించారు. సోమవారం కేసు వివరాలను విలేకరుల సమావేశంలో సీఐ వెల్లడించారు. మాసాయిపేటలోని ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు మోతుకూరి నాగరాజు అద్దెకు ఉంటున్న ఇంట్లోని మరో గదిలో ఓ మహిళ తన భర్త సత్యనారాయణ కూడా అద్దెకుంటున్నారు. అయితే ఇద్దరికి వివాహేతర సంబంధం ఉందని సత్యనారాయణ తెలుసుకున్నాడు. ఎలాగైనా నాగరాజును హత్య చేయాలని మార్చి 28న తన బావమరిది కేపీహెచ్‌బీకి చెందిన పర్కాల మల్లేశ్, అతడి స్నేహితుడు జవహర్‌నగర్‌కు చెందిన సునీల్‌గౌడ్‌లను రప్పించాడు. అదే రోజు నాగరాజు అద్దెకుంటున్న గదిలోనే హత్య చేశారు. మరుసటి రోజు మృతదేహాన్ని మూటకట్టి ముగ్గురు కలిసి అద్దె కారులో తీసుకెళ్లి ప్రగతినగర్ చెరువులో పడేశారు. తండ్రి కనిపించడం లేదని నాగరాజు కుమారుడు వంశీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. 24 రోజులుగా అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం సత్యనారాయణను అదుపులోకి తీసుకొని విచారిస్తే తన భార్యతో వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. అతను తెలిపిన వివరాల ప్రకారం ప్రగతినగర్ చెరువులో నాగరాజు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసులో నిందితులు సత్యనారాయణ, మల్లేశ్, సునీల్‌గౌడ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. కాగా ఆదివారం ఉదయం నిందితుడి భార్య ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

శెట్టిపల్లికలాన్‌లో మహిళ..

కోహీర్‌లో యువకుడు..

వేర్వేరు చోట్ల దారుణ హత్యలు


వెల్దుర్తి: కంసమ్మ(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): ఇంట్లో నిద్రించిన ఓ మహిళను దారుణంగా హత్య చేసిన సంఘటన శెట్టిపల్లికలాన్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నవతగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సూది కంసమ్మకు.. కుమారుడు నర్సింహులు, ముగ్గురు కూతుర్లు సంతానం. చిన్న కూతురు యశోదకు మెదక్ పట్టణానికి చెందిన దశరథ్‌తో వివాహమైంది. కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. 20 రోజుల క్రితం భర్తతో గొడవ కారణంగా అత్తారింటి నుంచి వచ్చి వేరే ప్రాంతంలో నివాసం ఉంటుంది. తన భార్య కాపురానికి రాకపోవడానికి, కలహాలకు అత్త కంసమ్మే కారణమనే అనుమానంతో దశరథ్ ఇంటికి వచ్చి గొడవ పడేవాడు. ఈ క్రమంలో అంసాన్‌పల్లి గ్రామానికి చెందిన తన సోదరి బాలామణితో కలిసి కంసమ్మ సోమవారం రాత్రి నిద్రించింది. మంగళవారం ఉదయం చూస్తే ఆమె రక్తపు మడుగులో ఉంది. బాలామణి అరుపులతో చుట్టుపక్కల వారు వచ్చి చూస్తే అప్పటికే కంసమ్మ మృతిచెందింది. గొడ్డలి వంటి పదునైన ఆయుధంతో గొంతుపై బలంగా నరకడంతో నిద్రలోనే మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు. సంఘటన స్థలాన్ని తూప్రాన్ సీఐ కృష్ణ, వెల్దుర్తి ఎస్‌ఐ నవతగౌడ్, మెదక్ క్లూస్ టీం సభ్యులు చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, అల్లుడే హత్య చేశాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోహీర్(జహీరాబాద్): స్నేహితుల మధ్య జరిగిన గొడవ ఒకరి దారుణ హత్యకు దారితీసింది. ఈ సంఘటన మండల కేంద్రమైన కోహీర్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... హైదరాబాద్ జగద్గిరిగుట్ట నివాసి షేక్ అన్వర్(30) కోహీర్ మండలంలోని రాజనెల్లి గ్రామ వాసి ముస్తకిన్, గురుజువాడ గ్రామ వాసి కైఫ్ ముగ్గురు స్నేహితులు. అన్వర్ ఆటోలను అద్దెకిచ్చి జీవిస్తున్నాడు. ముస్తకిన్ కూడా అన్వర్ వద్ద ఆటో అద్దెకు తీసుకొని నడుపుతున్నాడు. కిరాయి వసూలు కోసం సోమవారం సాయంత్రం అతను ఇక్కడికి వచ్చాడు. రాత్రి సమయంలో ముగ్గురు కలిసి స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో మద్యం తాగారు. అద్దె చెల్లింపు విషయంలో అన్వర్, ముస్తకిన్‌కు మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన అన్వర్ తనతో తెచ్చుకున్న కత్తిలో ముస్తకిన్‌పై దాడికి దిగాడు. స్వల్పంగా గాయపడిన ముస్తకిన్, ఖైఫ్ సహాయంతో ఎదురు తిరిగి కత్తిని లాగేసుకొని ప్రతి దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అన్వర్ అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య అనంతరం ఎనిందితులు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు.

బీఫామ్ అందుకున్న నీలం మధు


బీఫామ్‌ను అందుకుంటున్న నీలం మధు

పటాన్‌చెరు: కాంగ్రెస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ బీఫామ్ అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో.. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జగ్గారెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, హరగోపాల్ నుంచి అందుకున్నారు. అనంతరం మధు ముదిరాజ్ మాట్లాడుతూ బీసీ వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చి కాంగ్రెస్ తరపున పోటీ చేసే అవకాశం కల్పించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. మెదక్ లోక్‌సభ పరిధిలోని పార్టీ శ్రేణులతో కలిసి తాను సమన్వయంతో పనిచేస్తానన్నారు. ఇందిరమ్మ ప్రాతినిథ్యం వహించిన మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు.

రూ.1.60 లక్షలు సీజ్


జహీరాబాద్: వాహన తనిఖీలో పట్టుబడిన నగదుతో పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హుస్సెల్లి చెక్ పోస్టు వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.1.02 లక్షలు పట్టుకున్నట్లు హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు తెలిపారు. ఎన్నికల్లో భాగంగా కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి కారులో అనుమతి లేకుండా తీసుకు వెళ్తున్న డబ్బును పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆ మేరకు నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేర్యాలలోనూ..

చేర్యాల(సిద్దిపేట): లోకసభ ఎన్నికల సందర్భంగా పట్టణ కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో ఎస్‌ఐ దమోదర్‌తో కలిసి సీఐ శ్రీను మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎల్లుపల్లి గ్రామానికి చెందిన ప్రొద్దుటూరి వెంకటేష్ కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.60,050లను సీజ్ చేశారు. అనంతరం సీఐ శ్రీను మాట్లాడుతూ ఎవరైనా సరే రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకు వెళ్లేటప్పుడు ఆధారాలు వెంట ఉండాలన్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ పేరిట సైబర్ వలలో చిక్కి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భారీగా నగదు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బీరంగూడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్‌కు మార్చి 6న మెసేజ్ వచ్చింది. అందులో వివరాలను నమోదు చేస్తే సైట్ నిర్వాహకుడు ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.5 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేస్తున్నాడు. తాను పెట్టిన నగదును సైబర్ కేటుగాడు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో మొత్తం రూ.22.65 లక్షలు చెల్లించాడు. కాగా చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్రెడిట్ కార్డు కేవైసీ పేరిట కూడా ..

దుబ్బాక: క్రెడిట్ కార్డు పేరిట కేవైసీ అప్డేట్ పేరిట నగదు పోగొట్టుకున్న వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. ఈ సంఘటన పట్టణంలో జరిగింది. మంగళవారం సిద్దిపేట సీపీ అనురాధ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ బాధితుడికి గుర్తు తెలియని సైబర్ నేరగాడు ఫోన్ చేసి క్రెడిట్ కార్డు కేవైసీ అప్డేట్ చేసుకోవాలని చెప్పడంతో నమ్మి కార్డు నంబర్, ఓటీపీ చెప్పాడు. దీంతో రెండు విడతల్లో రూ.1.34 లక్షలు డెబిట్ అయ్యాయి. వెంటనే బాధితుడు 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. అలాగే సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు ఇవ్వడంతో ఏసీపీ శ్రీనివాస్ దర్యాప్తు ప్రారంభించారని సీపీ తెలిపారు. కాగా, అనురాధ మాట్లాడుతూ, సైబర్ బాధితులు సిద్దిపేట సైబర్ క్రైమ్ స్టేషన్‌కు వచ్చి నేరుగా ఫిర్యాదు చేయొచ్చన్నారు.

రూ.22.65 లక్షలు కాజేసిన కేటుగాడు

డయాగ్నోస్టిక్స్ సెంటర్లలో తనిఖీ

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని పలు డయాగ్నోస్టిక్ సెంటర్లలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రభాకర్ తనిఖీలు చేపట్టారు. ల్యాబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతుల వివరాలు తెలుసుకున్నారు. ప్రైవేట్ ల్యాబ్‌ల సేవలు, ఫీజుల పట్టికలపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. డెంగీ, మలేరియా తదితర పరీక్షల వివరాలు సేకరించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

సిద్దిపేటఅర్బన్: కుటుంబ సభ్యులతో గొడవ పడిన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లిలో జరిగింది. సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వ తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన కొమ్ము రమేష్ (27) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో తన తల్లితో గొడవపడి కొట్టాడు. అడ్డుకోబోయిన అక్క, వదినలపై చేయిచేసుకున్నాడు. గొడవ జరుగుతున్న విషయం తెలుసుకొని వచ్చిన అన్న యాదగిరిని సైతం కొట్టాడు. అనంతరం భోజనం చేసి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గ్రామంలోని ఓ వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని మృతిచెంది ఉండడాన్ని మంగళవారం ఉదయం గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోయి కుటుంబసభ్యులతో గొడవపడుతూ ఇంట్లో నుంచి వెళ్లిపోయి మళ్లీ ఇంటికి తిరిగి వస్తుండేవాడని తెలిపారు. క్షణికావేశంలో ఇంట్లో గొడవ పడి ఉరేసుకొని మృతిచెందాడని మృతుడి అన్న యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా ట్రాన్స్‌జెండర్

నియామక పత్రం అందజేసిన జడ్జి రఘురాం


ట్రాన్స్‌జెండర్ ప్రశాంతికి నియామక పత్రం అందజేస్తున్న రఘురాం, మురళీమోహన్, స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగిగా ట్రాన్స్‌జెండర్‌ను నియమించామని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం తెలిపారు. మంగళవారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నామాపూర్ గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ ప్రశాంతిని సిద్దిపేట కోర్టులోని లీగల్ సర్వీసెస్ అథారిటీలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగిగా నియమించామని, ఐటీఐ పూర్తి చేసిందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు మేరకు సమాన గౌరవం దక్కాలని, సమాన హక్కుల కోసం చేసిన కృషిలో భాగంగా నియమించామన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మురళీమోహన్, స్వాతిరెడ్డి, మిలింద్‌కాంబ్లి, చందన తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలకు రండి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేట గౌడసంఘం ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలకు రావాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు కరీంనగర్‌లో ఆ మేరకు ఆహ్వానించారు. ఆహ్వానపత్రిక అందజేసిన వారిలో బుడిగె గురువయ్య గౌడ్, అయిలోనిగౌడ్, నర్సింహులుగౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఉపాధిలో అవకతవకలు

శివ్వంపేట(నర్సాపూర్): జాతీయ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని అడిషనల్ డీఆర్‌డీఓ విరోజా హెచ్చరించారు. మంగళవారం ఎంపీపీ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు నిర్వహించిన పనులపై ఆడిట్ నిర్వహించారు. వివిధ పనులకు సంబంధించి కొలతల్లో తేడాలు, ప్రొసీజర్ లాప్స్ తదితర తప్పులు గుర్తించడంతో సిబ్బందికి రూ.1,13,415 రికవరీ, రూ.47వేలు పెనాల్టీ విధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, అసిస్టెంట్ డీవీఓ సంపత్‌కుమార్, క్వాలిటీ కంట్రోలర్ రమాకాంత్, ఎంపీడీఓ ఉన్నారు.

బహుజనులు రాజ్యాధికారం సాధించాలి

గజ్వేల్‌రూరల్: బహుజనులు చైతన్యవంతులై రాజ్యాధికారం సాధించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఓం ప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లో బీఎస్పీ గజ్వేల్ నియోజకవర్గ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, అనుబంధ సంఘాలు కలిసి కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దారాదత్తం చేసే అవకాశముందన్నారు.